# క్షమాపణ

చి॥ మామిళ్ల శివరామకృష్ణప్రసాదుగారు

౧

అది సంధ్యాసమయము. వింతవింత రంగులతో ఆకాశమంతా అలంకరింపబడినది. చల్లనిపిల్లగాలి మెల్ల మెల్లగా వీస్తూఉన్నది. స్నేహితుడువచ్చేసమయము సమీపించినదని నవ్వుతూ కలువపూలు ఆకాశంవైపు చూస్తూఉన్నవి.

పలుచని తెలిచీరెధరించి దేహకాంతులు సంధ్యారాగములో మిళితమైపోవ, విలాసంగా నడుస్తూ ప్రభావతి మంచినీటిబావివైపు వెళ్లుతూఉన్నది. బావిదగ్గర చాలామంది ఆడవాళ్లు లోకాభిరామాయణం చెప్పుకుంటూ నీళ్లుతోడ్తూ ఉన్నారు. ప్రభావతి బిందె ఒకచోటపెట్టి ఆకాశంవైపుచూస్తూ ఏమేమో ఆలోచనచేస్తూ ఉన్నది. ఆమెఆలోచనకు అంతుకనపడలేదు. బావివద్దనున్న స్త్రీలందరు వెళ్లిపోయినప్పటికి ఆమె అట్లే ఆలోచనచేస్తూ ఉన్నది. ఆమె అంతగా ఆలోచనలో మునిగిపోవుటకు కారణం లేకపోలేదు. తొమ్మిది సంవత్సరముల క్రింద లండనులో విద్యనభ్యసించుటకు వెళ్ళినభర్త ఒకటి రెండు దినములలో తిరిగి రానున్నాడు. అతడు లండను పోవునపుడు, ఆమె ఏనిమిదిసంవత్సరముల బాలిక; ఇప్పు డామె పదునేడుసంవత్సరముల పడుచు. తనభర్త తన్ను గుర్తుపట్టునో లేదోయని ఆమె యోచింప గడగెను. నాగరికతకు నిలయమగు లండనుపట్టణమున అతడెన్ని క్రొత్తపద్ధతుల నేర్చుకొనెనో, తానుధరించు చీరెలను, తానుముఖమునదిద్దు తిలకమును, తనమాటలను విని అతడెంత ఏవగించుకొనునో యని ఆమెభయపడుచుండెను. అతడు తన్ను పలుకరించునా లేక పాశ్చాత్యసుందరులను జూచిన కనులతో తన్నుజూచి అసహ్యముపొందునా? పాశ్చాత్యకామినులయందలి మక్కువచేత తన్నుపూర్తిగా విసర్జించునేమో? అట్లయినచో అతడే సర్వస్వమని నమ్మియున్న తాను ఏమికావలయును? అని పరిపరివిధముల యోచించెను. ఆమెకనులనుండి నీటిబొట్లు జలజల రాలెను. కాలగర్భమున నేమున్నదో యని తలచుచు నీటిబిందెతో వెడలిపోయెను.

౨

ఒకమాసము దినములు గడచెను. ఒకభవనమున పటములతో మిగులరమ్యముగా నలంకరింపబడియున్న గదియందొకమూల ప్రభావతి ఒంటరిగ కూర్చుండియుండెను. విద్యుద్దీపములకాంతిని ఆమె శరీరము మెఱసిపోవుచుండెను. కాని ఆమెముఖమున సంతోషచిహ్నమెక్కడేనియు గాన్పించుటలేదు. ఇంతలో తటాలున గదిలోనికి మనోహరుడు ప్రవేశించెను. అతడు కొంచెము పొడగరి, విశాలమైన నేత్రములు, పచ్చని పసిమిరంగుగలదేహము, అతని సౌందర్యమునకు మరింతవన్నె బెట్టుచుండెను.

క్రిందకూర్చునియున్న భార్యనుజూచి మనోహరుడు మెల్లగా "ప్రభావతీ! ఈగదిలో ఇన్నికుర్చీలుండగా నీవుక్రింద కూర్చునుటేమి? కుర్చీమీద కూర్చునుటకూడ పాశ్చాత్యపద్ధతియని తలచితివా? సింహాసనముమీద కుర్చున్నట్లు నేను కుర్చీలోను, నీవు క్రిందను కూర్చునుట చాలాఅసహ్యంగా ఉంటుంది. ఇదిగో ఈకుర్చీలో కూర్చునుటకురమ్మ" అనిపిలచెను.

భర్తఆజ్ఞప్రకారము మెల్లగాలేచి ప్రభావతి కుర్చీలోకూర్చుండెను. ఆమెముఖమును రెప్పవేయక చూస్తూ, కొంచెముఖము చిట్లించి మనోహరుడు "ప్రభావతీ! నీకుమాటలురావా? ఒక్కసారైనా మాట్లాడవు. నీవేమి తలుస్తూ ఉన్నావో నాకుతెలియుటలేదు." అనియనుచు కొంచెముసేపూరకుండి మరల, "ప్రభా

688

వతీ! నీవు వెంట్రుకలను చాలాబిగువుగా అల్లి జెడవేసుకుంటున్నావు; అది చాలా అసహ్యమైనపని; వెంట్రుకలను వదులు వదులుగా కొంచెము చెవులపైగా వచ్చునట్లు వదలి జెడవేసుకుంటే చాలాబాగుంటుంది; చూడు నీవుఇల్లువదలి వీధిలోనికి పోవునపుడు చెట్టికాళ్లతో వెళ్లడం చాలాప్రమాదము; కోమలమైన నీపాదాలు కందిపోయి కొన్నిదినములకు వికారరూపంగా ఉండును కాబట్టి చక్కని మేజోళ్లతొడుగుకొని వాటిపై బూట్సువేస్తే చాలాఅందంవస్తుంది. నీయుద్దేశ్యమేమిటి" అన్నాడు. ప్రభావతి కొంచెముతలవంచి "అవి మనదేశమర్యాదకు చెందినవస్తువులుకావు; అవి లేకుండా మనదేశంలో కాలము గడుపవచ్చును." అని మెల్లగా పలికింది. ముఖము చిట్లించి మనోహరుడు "నేను తప్పకుండా ధరించమంటే వానిని ధరింపవా?" అన్నాడు.

"తమఆజ్ఞకు భిన్నములేదు, నాకిష్టములేకున్నను తమరు ధరింపమన్నచో ధరించితీరెదను" అని ప్రభావతి జవాబుచెప్పెను.

"నీకుఇష్టము లేకుండా వాటినిధరిస్తే చాలా అందవికారంగా ఉంటావు. నీదయవచ్చినట్లు పోగనిమ్ము. నీప్రవర్తన నాకింకా బోధపడలేదు. నీవునన్ను మనసార ప్రేమించావో లేదో నాకుతెలియదు. నిజముగా భారతనారీమణులు తమభర్తలయెడ సహజమైన ప్రేమగలవారుగా నుండరు. లోకానికి వెరచి తప్పని సరిగా కొంత కృత్రిమప్రేమ భర్తలయెడ కనబరుస్తూ ఉంటారు; దీనికికారణం వాండ్లు కోరుకొని చేసుకొనిన భర్తలు కాకపోవటమేను. ఇట్టిఅవస్థ పాశ్చాత్యదేశములలోలేదు. నిజంగా భార్యాభర్తలప్రేమంటే అచ్చటనే చూడవలెను. వాండ్లు మనసార ఒకరినొకరు ప్రేమించి చేసుకుంటారు. కాబట్టి చాలాసౌఖ్యంగా ఉంటారు; కృత్రిమప్రేమ వాండ్లకు తెలియదు." అనిచెపుతూ మనోహరుడు కోటుజేబునుండి ఒక ఛాయాచిత్రమును తీసి ప్రభావతి యెదుట పెట్టెను. ములుకులబోలు పలుకులను వినుచు లోలోన కుమిలికుమిలిపోవుచున్న ప్రభావతి ఆఛాయాచిత్రమును చూడగడగెను. అదియొకపాశ్చాత్యసుందరి యొక్క ఛాయాచిత్రము. ఆమె కాపటమునుజూపుచు మనోహరుడు "ప్రభావతీ! చూడు మా సౌందర్యము. ఆవిశాలనేత్రములు, చిరునవ్వుదొంతరల దొర్లించుచున్న ఆపెదవులు. అహా! నీవును ఇట్లుండిన ఎంతబాగుండును? ఈమె నాస్నేహితురాలు. నేటివరకు ప్రతిదినము జాబులు వ్రాయుచున్నది. ఈమె సౌందర్యవతియని నీవును ఒప్పుకొనక తప్పదుగదా! భారతరమణీమణులలో మచ్చునకైన ఇట్టి సౌందర్యము గలవారున్నారా? నే నీమెనెట్లుప్రేమించుచున్నానో నీవును ఆమెనట్లే సద్భావముతో జూడవలెను." అని యేమేమో చెప్పుచుండెను.

ప్రభావతి కనులనుండి అశ్రుకణములు రాలదొడగెను. ఆమెదుఃఖమును దిగమ్రింగ ప్రయత్నించెను— కాని ఎట్లు? గదినుండివెడలిపోబోయెను. కాని ఆమెకన్న త్వరగా మనోహరుడు వెడలిపోయెను. ఆమె నేలపైబడి మూర్ఛిల్లెను.

## 3

ఒకనాటి రాత్రి దాదాపు తొమ్మిదిగంటలవేళ ప్రభావతి వంటగదిలో కూర్చుండి నిప్పుపై అప్పడములు కాల్చుచుండెను. ఇంతలో ఆమెఅత్తగారు పెద్దగఏడ్చుచు "అయ్యో! ఇంకేమిగతి? ఇంటిలోమనకెంత గతిపట్టెను?" అని కేకలువేయుచు పరుగెత్తుకొనివచ్చెను. ప్రభావతి తెల్లబోయి గడగడవణకుచు నిలచిపోయెను. "అయ్యో! అబ్బాయికి పెరటిలో పాముకరచినది, క్రిందపడిపోయినాడు" అని అత్తగారు వెఱ్ఱికేకపెట్టి నేలపైకూలెను.

"పాముకరచినది" అను పలుకులు వినినంతనే ప్రభావతి సర్వమును మరచిపోయినది. రానున్న భయంకరజీవితము ఆమె కనులముందు మెరసిపోయెను. ఆమె పిచ్చిదానివలె కేకలు వేయుచు పెరటిలోనికి పరుగు పరుగున బోయెను. ఒక దీపము ముందు కాలునకు కట్టు కట్టుకొని బాధపడుచున్న భర్తను గాంచెను. ఆమె పైప్రాణములు పైననే లేచిపోయెను. "తమకిపుడెట్లున్నది" అని భర్తను ప్రశ్నించి, ఆతడు జవాబు చెప్పునంతలోనే నలుదిక్కుల పరికించి, చెట్టుప్రక్కనుండి ప్రాకిపోవుచున్న పామును జూచి, చంగున అచ్చటకు గంతువైచి "నన్నేల కరవరాదు? ఇంకా నా బ్రతుకెందుకు?" అనియనుచు, భర్త కేకలు వేయుచున్నను వినక ఆపాము తలపై చేతితో కొట్టెను. ఆపాము క్షణములో ఆమె కోమలహస్తమున రెండు గాట్లు వైచెను. ఆమె నేలపైబడెను......మనోహరుని కనులనుండి బాష్పబిందువులు రాలెను.

## ౪

ప్రభావతి మూర్ఛనుండి తేరుకొను నప్పటికి "ప్రమాదములేదు, త్రాచుపాము కానందున కొలదిగంటలలోనే నిమ్మళించును, భయపడనవసరము లేదు" అను డాక్టరుమాటలు ఆమెచెవులబడెను. డాక్టరు గది నుండి వెడలిపోయిన తరువాత ప్రభావతి మెల్లగా కన్నులు విప్పెను. తనపాన్పుప్రక్కన నిలచియున్న భర్తపై ఆమె చూపులు పడెను. సిగ్గుచే మరల కన్నులు మూసికొనెను. ఇంతలో మనోహరుడు "ప్రభావతీ! మేలుకొనియున్నావా?" అని ప్రశ్నించెను. ఈ పలుకులు ఆమెకమృతప్రాయములయ్యెను. తొట్రుపడు మాటలతో "పాము—మీరు క్షేమముగానున్నారు కదా" అని యామె ప్రశ్నించెను. "నేను క్షేమముగానే యున్నాను; వైద్యసహాయము త్వరలో జరిగినందున మన మిరువురము జీవించితిమి......పిచ్చిదానివలె నీవట్లేల జేసితివి?" అని మనోహరుడు దీనముగా బల్కెను. కన్నులకు చీరచెరగు అడ్డముగా పెట్టుకొని ప్రభావతి "మీరు నా ప్రాణప్రియులు, మీతో నేనును చచ్చిపోవలయునని ప్రయత్నించుటలో తప్పేమియున్నది?" అని పలికెను.

మనోహరుని ముఖమున ఒక నూతనశోభ ఆవిర్భవించెను. ప్రియురాలి దేహముపై చేయివైచి "ప్రభా! పవిత్రమైన నీప్రేమ కనుగొనలేక నేను పలికిన పలుకులను మరచిపొమ్ము. నీ వేషభాషలలో మార్పు లేవలయునని నిన్ను విసిగింపను. నీవు నా ప్రియురాలవు. నీవు లేకున్నచో నా జీవితము దుఃఖభాజనమైపోవును. నీవే నా సర్వస్వమని నమ్ముచున్నాను." అని మనోహరుడు మెల్లగా ననెను. "......ఆపాశ్చాత్యసుందరియో?" అని ప్రభావతి యులికిపాటున ప్రశ్నించెను. మనోహరుడు తలవంచెను. నయనము లశ్రుపూరితములయ్యెను. దీనముగా "ప్రభా! నాకామె స్నేహితురాలు మాత్రమె. నా హృదయసీమయందు నీకు దక్క పరులెవరికిని చోటు లేదని ప్రమాణమాచరించెదను. ఇదివరలో నేపలికిన పలుకులకు నన్ను క్షమింపుము." అని పలికెను.

"మీపాదసేవకురాలనగు నేనా మిమ్ము క్షమించునది? కొలదిదినములక్రింద భారతరమణీమణుల నందరను మీరు నిరసించియున్నారు. వారిప్రేమ కృత్రిమమని అపవాదము గల్పించియున్నారు. కోమలహృదయులగు నారీమణు లాపలుకులు విన్నచో ఎంత నొచ్చుకొందురో కదా? పాశ్చాత్యనాగరికతాపథమున బడి పోవుచున్న వారెందరీవిధముగ తలచుచున్నారో గదా? పవిత్రురాండ్రగు భారతనారీమణులపై ఇట్టి దురభిప్రాయములుండుట మహాపాతకము. మీ రాదినము వారలను నిరసించినందులకు మీ క్షమాపణ వారిపత్రికయగు 'గృహలక్ష్మి' ద్వారా వారలకందజేయుట యుక్తము. ఇట్లు పలికినందులకు నన్ను క్షమింపుడు." అని ప్రభావతి పలికెను.

మనోహరుడు:—ప్రభా! నీవొనర్చిన కృత్యమువలన సత్యమును గ్రహించితిని. నన్ను క్షమింపుము, నే నట్లే యొనర్చెదను.